సాక్షి
అనకాపల్లి
శనివారం । 25 । మే । 2024



ఘనంగా క్షీరాభిషేకం

విశాఖ నగరంలోని బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి అమ్మవారికి శుక్రవారం క్షీరాభిషేక సేవ నిర్వహించారు.



కల్యాణం.. కమనీయం

సింహాచలం: సింహగిరిపై శ్రీ వరాహ లక్ష్మీ నృసింహస్వామి నిత్య కల్యాణం శుక్రవారం విశేషంగా నిర్వహించారు.

గరిష్ఠం/కనిష్ఠం
36.8/27.0

వాతావరణం

తేలికపాటి వర్షాలు, ఉరుములతో కూడిన జల్లులు ఒకటి, రెండు చోట్ల కురిసే అవకాశముందని ఆర్‌ఏఆర్‌ఎస్ వాతావరణ విభాగం శాస్త్రవేత్త వి.గౌరి శుక్రవారం చెప్పారు.

న్యూస్‌రీల్

ఖరీఫ్‌కు రైతులను సన్నద్ధం చేయండి



మాట్లాడుతున్న మోహన్‌రావు

నక్కపల్లి: ఖరీఫ్ సీజన్‌కు రైతులను సన్నద్ధం చేయాలని జిల్లా వ్యవసాయాధికారి మోహన్ రావు సూచించారు. శుక్రవారం నక్కపల్లిలో వ్యవసాయ శాఖ, ఉద్యానవన శాఖ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఖరీఫ్‌లో వివిధ రకాల విత్తనాలు, పంటల ఎంపిక, పచ్చిరొట్ట ఎరువులు, విత్తనాల వినియోగంపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. రైతు భరోసా కేంద్రాల్లో పచ్చిరొట్ట ఎరువు అందుబాటులో ఉందన్నారు. వాటిని రైతులు వినియోగించుకునేలా చూడాలన్నారు. కొత్త రకాల వరి విత్తనాలను మార్చుకోవాలని సూచించారు. ఖరీఫ్‌లో రైతులకు అవసరమైన సలహాలు, సూచనలు అందజేయాలన్నారు. రైతు భరోసా కేంద్రాల్లో సిబ్బంది అందుబాటులో ఉండాలని, క్షేత్ర స్థాయి పర్యవేక్షణ చేయాలని చెప్పారు. మట్టి నమూనాల సేకరణ, పరీక్షల గురించి రైతులకు తెలియజేయాలన్నారు. రైతు భరోసా కేంద్రాల ద్వారానే విత్తనాలు, ఎరువులు సరఫరా చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పాయకరావుపేట ఏడీ ఉమాప్రసాద్, వివిధ మండలాల వ్యవసాయ శాఖ సిబ్బంది, వీఏఏ, వీహెచ్‌ఏలు పాల్గొన్నారు.

రాజభాషా అమలులో వాల్తేర్ డివిజన్‌కు ప్రథమ స్థానం



బహుమతి సాధించిన వాల్తేర్ డివిజన్ అధికారులతో డీఆర్ఎం సౌరబ్ ప్రసాద్

తాటిచెట్లపాలెం: రాజభాషా అమలు చేసే ప్రధాన కార్యాలయాల జాబితాలో వాల్తేర్ డివిజన్ 2023–24గాను ప్రథమ బహుమతిని సొంతం చేసుకుంది. వాల్తేర్ డివిజన్‌కు చెందిన ఆరుగురు అధికారుల కృషి ఫలితంగా ఈ బహుమతిని సొంతం చేసుకున్నట్లు అధికారులు తెలిపారు. టీవోఎల్ఐసీ విశాఖ ఆధ్వర్యంలో ఉద్యోగులకు వివిధ హిందీ పోటీలను నిర్వహించారు. ఈ పోటీలలో విజేతలైన వారికి వాల్తేర్ డివిజన్, డివిజనల్ రైల్వే మేనేజర్, టౌన్ అఫీషియల్ లాంగ్వేజ్ ఇంప్లిమెంటేషన్ కమిటీ చైర్మన్ సౌరబ్‌ప్రసాద్ చేతులమీదుగా ప్రశంసా పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో ఏడీఆర్ఎం(ఆపరేషన్స్) మనోజ్‌కుమార్ సాహూ, ఇంచార్జి సెక్రటరీ టీఓఎల్ఐసీ/ రాజభాషా అధికారి వీరేంద్ర కాజీ, టీవోఎల్ఐసీ మెంబర్ కార్యాలయాల ఉన్నతాధికారులు, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

చందనోత్సవంలో బాలల వసతులపై ప్రశంస

సింహాచలం: ఈ నెల 10న జరిగిన శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామి చందనోత్సవంలో బాలలు ఇబ్బంది పడకుండా సింహాచలం దేవస్థానం అధికారులు ఏర్పాట్లు చేశారని ఏపీ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు గొండు సీతారాం అన్నారు. ఈమేరకు శుక్రవారం సింహగిరిపై దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తిని సీతారాం ఘనంగా సత్కరించి ప్రశంసా పత్రం అందజేశారు. దేవస్థానం ఈవో శ్రీనివాసమూర్తి మాట్లాడుతూ దేవదాయశాఖ కమిషనర్, జిల్లా కలెక్టర్, నగర పోలీస్ కమిషనర్ ఇతర ఉన్నతాధికారుల సహాయసహకారాలతో భక్తులు ఇబ్బంది పడకుంగా మెరుగ్గా ఏర్పాట్లు చేశామన్నారు.

కౌంటింగ్‌కు కౌంట్‌డౌన్

- ఎన్నికల ఫలితాలకు సరిగ్గా 10 రోజులు
- జోరందుకున్న అధికారుల ఏర్పాట్లు
- అసెంబ్లీ, పార్లమెంట్ ఓట్ల లెక్కింపునకు వేర్వేరుగా గదుల కేటాయింపు
- ఒక్కో అసెంబ్లీ నియోజకవర్గానికి 14 టేబుళ్ల ఏర్పాటు
- తొలుత 19,374 పోస్టల్, సర్వీస్, హోమ్ ఓట్ల లెక్కింపు, తరువాత ఈవీఎంలు
- లెక్కింపు ప్రక్రియలో పాల్గొననున్న 1500 మంది సిబ్బంది





ఈనెల 13న కమాండ్ కంట్రోల్ రూమ్ నుంచి పోలింగ్ తీరును పరిశీలించిన జిల్లా ఎన్నికల అధికారి రవి పట్టన్‌శెట్టి.. కౌంటింగ్ రోజు కూడా ఇదే విధంగా కంట్రోల్ రూమ్ పనిచేస్తుంది (ఇన్‌సెట్) కౌంటింగ్ ఏర్పాట్లపై చర్చిస్తున్న జిల్లా ఎన్నికల అధికారి రవి పట్టన్‌శెట్టి, ఎస్పీ మురళీకృష్ణ

సాక్షి, అనకాపల్లి: సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియ సజావుగా నిర్వహించేందుకు అధికార యంత్రాంగం సమాయత్తమవుతోంది. జూన్ 4న జరిగే కౌంటింగ్‌కు సరిగ్గా పది రోజులే ఉండడంతో ఏర్పాట్లు జోరందుకున్నాయి. ఎస్పీ కార్యాలయం సమీపంలోని ఫ్యూచర్ వరల్డ్ స్కూల్లో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్‌లో జిల్లాలోని ఆరు అసెంబ్లీ, ఒక పార్లమెంట్ నియోజకవర్గానికి సంబంధించిన ఈవీఎంలను భద్రపరిచిన సంగతి తెలిసిందే. అదే స్కూల్లో మరో పక్క కౌంటింగ్‌కు ఏర్పాట్లు చేస్తున్నారు. అభ్యర్థుల సమక్షంలో గురువారం నుంచి లాజిస్టిక్ అరేంజ్‌మెంట్స్ ప్రారంభించారు. అనకాపల్లి జిల్లా ఏర్పడిన తర్వాత జరిగిన తొలి సార్వత్రిక ఎన్నికలివి. మొత్తం 1500 మంది సిబ్బంది లెక్కింపు ప్రక్రియలో పాల్గొంటున్నారు.

కౌంటింగ్ ఏర్పాట్లు ఇలా..

చోడవరం, మాడుగుల, అనకాపల్లి, యలమంచిలి, పాయకరావుపేట, నర్సీపట్నం అసెంబ్లీ నియోజకవర్గాలకు వేర్వేరుగా కౌంటింగ్ హాల్స్ ఉంటాయి. ప్రతి కౌంటింగ్ హాల్లో 14 టేబుల్స్ ఏర్పాటు చేయనున్నారు. జిల్లాలో ఉన్న ఆరు అసెంబ్లీ నియోజకవర్గాలకు 84 టేబుల్స్ ఉంటాయి. వీటితో పాటుగా పార్లమెంట్ ఓట్ల లెక్కింపునకు మరో ఆరు హాళ్లలో 14 టేబుల్స్ చొప్పున సిద్ధం చేస్తున్నారు. ఉదయం 8 గంటలకు లెక్కింపు ప్రారంభం కానుంది. లెక్కింపు సమయంలో గెజిటెడ్ ర్యాంకు కల్గిన స్టాఫ్ కౌంటింగ్ సూపర్‌వైజర్, కౌంటింగ్ అసిస్టెంట్, మైక్రో అబ్జర్వర్, ఈవీఎంలు అందజేయడానికి ఇద్దరు వీఆర్వో (బీఎల్వోలుగా పనిచేసినవారు) ఉంటారు. రిటర్నింగ్ అధికారి టేబుల్ దగ్గర ప్రత్యేకంగా నియమించిన అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి పర్యవేక్షణలో ఆ నియోజకవర్గ పోస్టల్ బ్యాలెట్, సర్వీసు ఓట్లను, ఇతర జిల్లాల్లో పనిచేస్తున్న వారి ఓట్లను అసెంబ్లీ, పార్లమెంట్‌కు వేర్వేరుగా లెక్కిస్తారు. జిల్లాలో హోమ్ ఓట్లు 1082, ఎన్నికల సిబ్బంది ఓట్లు 12,864, సర్వీసు ఓట్లు 1051, ఇతర జిల్లాల్లో పనిచేస్తున్నవారి ఓట్లు 2,909 మొత్తం 19,374 ఓట్లు ఉన్నాయి. వీటి లెక్కింపు పూర్తయిన అరగంట తరువాత ఈవీఎంలలో ఓట్లను లెక్కించనున్నారు.

ప్రతి రౌండ్‌కు అర్ధ గంట

ఒక రౌండ్ లెక్కింపునకు సగటున అరగంట పడుతుందని అంచనా. ప్రతి రౌండ్‌కు 14 టేబుల్స్ చొప్పున లెక్కింపు జరగనుంది.

నియోజకవర్గం	పోలింగ్ కేంద్రాలు	రౌండ్లు	చివరి రౌండ్‌లో పోలింగ్ కేంద్రాలు
చోడవరం	243	18	5
పాయకరావుపేట	292	21	12
మాడుగుల	235	17	11
అనకాపల్లి	251	18	13
యలమంచిలి	246	18	8
నర్సీపట్నం	262	19	10

మాడుగులదే తొలి ఫలితం

మాడుగుల అసెంబ్లీ నియోజకవర్గంలో
మొత్తం ఓట్లు 1,88,989
పోలైనవి 1,62,580
పోలింగ్ కేంద్రాలు అత్యల్పంగా 235

కమాండ్ కంట్రోల్ రూమ్ ద్వారా పర్యవేక్షణ

పోలింగ్ రోజులాగే లెక్కింపు జరిగే జూన్ 4న వెబ్‌కాస్టింగ్‌తో కమాండ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేస్తున్నాం. అక్కడి నుంచే కౌంటింగ్ తీరును పర్యవేక్షించవచ్చు. అధికారుల కోసం ఒకటి, పోటీలో ఉన్న అభ్యర్థుల కోసం మరొకటి కమాండ్ కంట్రోల్ రూమ్‌లు అందుబాటులో ఉంటాయి. అభ్యర్థులు ఆయా నియోజకవర్గాల కౌంటింగ్ ప్రక్రియను ఎప్పటికప్పుడు పరిశీలించవచ్చు. అసెంబ్లీ నియోజకవర్గ ఆర్వోలు జారీ చేసిన పాస్‌లు ఉన్నవారినే లోపలకి అనుమతిస్తాం. అభ్యర్థుల సమక్షంలో ఈనెల 23 నుంచి లాజిస్టిక్ అరేంజ్‌మెంట్స్ చేస్తున్నాం.

– రవి పట్టన్‌శెట్టి, జిల్లా ఎన్నికల అధికారి

మధ్యవర్తిత్వంతో పెండింగ్ కేసుల పరిష్కారం



సుప్రీంకోర్టు మధ్యవర్తిత్వ కేంద్రం శిక్షకులు వీకె బన్సాల్, సునీల్ కుమార్‌లకు సన్మానం

విశాఖ లీగల్: దేశంలోని న్యాయస్థానాల్లో పెండింగ్‌లో ఉన్న కేసుల సత్వర పరిష్కారానికి మధ్యవర్తిత్వం ఎంతో అవసరం అని సుప్రీంకోర్టు మధ్యవర్తిత్వ కేంద్రం శిక్షకుడు వీకే బన్సాల్ అన్నారు. విశాఖ జిల్లా న్యాయస్థానంలో ఉత్తరాంధ్ర జిల్లాలకు చెందిన న్యాయమూర్తుల ఐదు రోజుల మీడియేషన్ అండ్ కాన్సిలేషన్ శిక్షణ శిబిరం శుక్రవారంతో ముగిసింది. ఈ సందర్భంగా విశాఖ న్యాయవాదుల సంఘం సుప్రీంకోర్టు మధ్యవర్తిత్వ కేంద్రం శిక్షకులు వీకే బన్సాల్, సునీల్ కుమార్‌లను జిల్లా కోర్టులోని గ్రంథాలయంలో ఘనంగా సన్మానించింది. అనంతరం బన్సాల్ మాట్లాడుతూ విశాఖ న్యాయమూర్తులు, న్యాయవాదుల సహకారం మరువలేనిదన్నారు. సునీల్ కుమార్ మాట్లాడుతూ భవిష్యత్‌లో న్యాయస్థానాలపై ఒత్తిడి తగ్గించడానికి ప్రతి న్యాయవాది, న్యాయమూర్తి మీడియేషన్ కాన్సిలేషన్ విధానాన్ని పాటించాలన్నారు. వీటికి సంబంధించి పలు అంశాలను సోదాహరించారు. న్యాయ సేవ ప్రాధికార సంస్థ జాతీయ శిక్షకుడు రఘుపాత్రుని శ్రీనివాసరావు మాట్లాడుతూ కేసులు ప్రాథమిక స్థాయిలోనే విచారించి పరిష్కారం దిశగా ఆలోచిస్తే మంచి ఫలితాలు వస్తాయన్నారు. మధ్యవర్తిత్వం ద్వారా కేసులు రాజీకీయ కృషి చేయాలని రాష్ట్ర హైకోర్టు న్యాయ సేవ ప్రాధికార సంస్థ సభ్య కార్యదర్శి ఎం. భవిత అన్నారు. న్యాయవాదుల సంఘం కార్యదర్శి డి.నరేష్, కార్యవర్గ సభ్యులు గొలగాని అప్పారావు, హేమమాలిని పాల్గొన్నారు.

అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలు



రావికమతంలో సమావేశానికి హాజరైన నియోజకవర్గంలోని పలు పార్టీల నాయకులు



అడ్డురోడ్డులో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎస్పీ మురళీకృష్ణ

- ఎస్పీ మురళీకృష్ణ

ఎస్.రాయవరం/రావికమతం: కౌంటింగ్ సమయంలో అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఎస్పీ మురళీకృష్ణ హెచ్చరించారు. పాయకరావుపేట నియోజకవర్గంలోని వివిధ రాజకీయపార్టీల నాయకులతో అడ్డురోడ్డు శ్రీనివాస్ కల్యాణ మండపంలో, చోడవరం నియోజకవర్గంలోని రాజకీయ పార్టీల నాయకులతో రావికమతంలోని తిరుమల కల్యాణమండపంలో శుక్రవారం నిర్వహించిన సమావేశాల్లో ఆయన మాట్లాడారు. ప్రశాంత వాతావరణంలో పోలింగ్ జరిగిందని, అదే వాతావరణంలో కౌంటింగ్ కూడా జరగాలన్నారు. రెచ్చగొట్టేలా ఎవరూ వ్యవహరించవద్దని, నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. సమస్యాత్మక గ్రామాల్లో పోలీసు సిబ్బందితో నిఘా ఉంచామని చెప్పారు. బెట్టింగ్‌లకు పాల్పడితే చర్యలు తప్పవన్నారు. ఎన్నికల ఫలితాలు ఏ పార్టీకి అనుకూలంగా ఉన్నా సామరస్యంగా ఉండాలని సూచించారు. కౌంటింగ్ సందర్భంగా వచ్చేనెల 4న ప్రత్యేక నిఘా ఉంటుందన్నారు. రావికమతంలో జరిగిన సమావేశంలో డీఎస్పీ అప్పలరాజు మాట్లాడుతూ జూన్ ఆరో తేదీ వరకూ జిల్లాలో సభలు,సమావేశాలు,ర్యాలీలు, ధర్నాలు నిషేధమని తెలిపారు.

బాణసంచా కాల్చకూడదని, కౌంటింగ్ ఏజెంట్‌గా నియమితులైన వారు నిబంధనలు పాటించాలన్నారు. ఎస్.రాయవరంలో జరిగిన కార్యక్రమంలో నర్సీపట్నం డీఎస్పీ మోహన్, సీఐలు అప్పన్న, విజయ్‌కుమార్, పాయకరావుపేట జెడ్పీటీసీ లంక సూరిబాబు, ఎస్.రాయవరం వైస్ ఎంపీపీ బోడిపల్లి అప్పన్న, వివిధ పార్టీల నాయకులు నల్లపరాజు వెంకటరాజు, నరేష్, సత్యనారాయణ, రావికమతంలో జరిగిన సమావేశంలో కొత్తకోట సీఐ ఎల్.అప్పలనాయుడు,చోడవరం సీఐ బి.శ్రీనివాసరావు,రావికమతం, కొత్తకోట ఎస్‌లు పాల్గొన్నారు.

జూనియర్ మోడల్ చిహ్నికకు సత్కారం



చిహ్నికను సత్కరిస్తున్న దృశ్యం

గాజువాక : ఇటీవల కేరళలో నిర్వహించిన జూనియర్ మోడల్ ఇంటర్నేషనల్ పోటీల విజేత చిహ్నికను క్లాసిక్ ఎంటర్‌టైనర్స్ ప్రతినిధులు శుక్రవారం సత్కరించారు. ఈ మేరకు గాజువాకలో నిర్వహించిన కార్యక్రమంలో క్లాసిక్ ఎంటర్‌టైనర్స్ ప్రతినిధులు చిహ్నికను శాలువాతో సత్కరించి అభినందించారు.

తొలిరోజు టెన్త్, ఇంటర్ పరీక్షలు ప్రశాంతం

- అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు ప్రారంభం
- టెన్త్ తెలుగు పరీక్షకు 593 మంది హాజరు
- తొలి రోజు ఇంటర్ పరీక్షలు రాసిన 2,840 మంది



అనకాపల్లి వేల్పులవీధి జీవీఎంసీ హైస్కూల్లో విద్యార్థిని చెక్ చేస్తున్న మహిళా పోలీస్

అనకాపల్లి/తుమ్మపాల: ప్రశాంతమైన వాతావరణంలో టెన్త్, ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు ప్రారంభమయ్యాయి. జిల్లా వ్యాప్తంగా 20 పరీక్ష కేంద్రాల్లో పదో తరగతి తెలుగు పరీక్షకు 1,086 మంది విద్యార్థులకు గాను 54.60 శాతంతో 593 మంది హాజరుకాగా, 493 మంది గైర్హాజరైనట్లు జిల్లా విద్యాశాఖాధికారి ఎం.వెంకటలక్ష్మమ్మ తెలిపారు. డీఈవో స్వయంగా అచ్యుతాపురం పరీక్ష కేంద్రాన్ని సందర్శించారు. మూడు తనిఖీ బృందాలు 11 పరీక్ష కేంద్రాలను సందర్శించినట్లు పేర్కొన్నారు. ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు రెండు విడతలు నిర్వహిస్తున్నట్లు జిల్లా ఇంటర్మీడియట్ అధికారి బి.సుజాత తెలిపారు. ఉదయం జనరల్ కేటగిరీలో జరిగిన పరీక్షలకు 2,067 మందికిగాను 1,948 మంది హాజరైనట్లు పేర్కొన్నారు. ఒకేషన్ కేటగిరీలో 273 మందిలో 236 మంది హాజరయ్యారు. మధ్యాహ్నం జరిగిన పరీక్షల్లో జనరల్ కేటగిరీలో 521 మందికి 483 మంది పరీక్ష రాయగా, ఒకేషనల్లో 194 మందికి 173 మంది హాజరయ్యారు. మొత్తం 3,055 మందికి గాను 2,840 మంది పరీక్ష రాసినట్లు వెల్లడించారు. పరీక్షలు మొత్తం సీసీ కెమెరాల పర్యవేక్షణలో నిర్వహించారు. పరీక్ష కేంద్రాల వద్ద ప్రత్యేక సదుపాయాలతోపాటు, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా 144 సెక్షన్ అమలు చేశారు.

14 కేంద్రాల్లో నేడు డిప్యూటీ డీఈవో పరీక్ష

మహారాణిపేట: ఏపీపీఎస్సీ ఆధ్వర్యంలో డిప్యూటీ డీఈవో పరీక్ష శనివారం జిల్లా వ్యాప్తంగా 14 కేంద్రాల్లో జరుగుతుందని, మొత్తం 4,498 మంది అభ్యర్థులు హాజరవుతున్నారని జిల్లా రెవెన్యూ అధికారి కె.మోహన్ కుమార్ పేర్కొన్నారు. ఉదయం 9 గంటల నుంచి 11.30 గంటల వరకు పరీక్ష జరుగుతుందన్నారు. శుక్రవారం తన చాంబర్లో వివిధ విభాగాల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఎక్కడా ఎలాంటి సమస్యలు తలెత్తకుండా ప్రశాంత వాతావరణంలో పరీక్షను నిర్వహించాలని ఆదేశించారు. వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని, విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చూసుకోవాలన్నారు. పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసి ప్రశాంత వాతావరణంలో పరీక్ష జరిగేందుకు పోలీసు సిబ్బంది చర్యలు తీసుకోవాలని చెప్పారు.

కరుణించిన వరుణుడు

- జిల్లా వ్యాప్తంగా భారీ వర్షం
- చల్లబడిన వాతావరణం
- వేసవి దుక్కులకు మేలు
- రైతుల మోముల్లో ఆనందం



రోలుగుంటలో భారీ వర్షానికి జలమయమయిన రహదారి

సాక్షి, అనకాపల్లి: హమ్మయ్య.. వరుణుడు కరుణించాడు. కొన్ని రోజులుగా అధిక ఉష్ణోగ్రతలు, ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరవుతున్న ప్రజలకు ఉపశమనం కలిగించాడు. శుక్రవారం ఉదయం నుంచి భానుడు ఉగ్రరూపం దాల్చగా.. మధ్యాహ్నం 2 గంటల నుంచి ఆకాశంలో కారుమబ్బులు కమ్ముకుని ఉన్నపళంగా భారీ వర్షం కురిసింది. అత్యధికంగా యలమంచిలి మండలం కొక్కిరాపల్లిలో 4.5 సె.మీ వర్షపాతం నమోదైంది. జిల్లా వ్యాప్తంగా వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది. కొన్ని గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. ఎటువంటి ఈదురు గాలులు వీయకపోవడంతో ఎక్కడా ఆస్తి నష్టం వాటిల్లలేదు. ఈ వర్షంతో రైతుల ముఖంలో ఆనందం నెలకొంది. మెట్ట ప్రాంతాల్లో చెరకు, సరుగుడు, అరటి, తదితర పంటలకు ఊపిరి పోసిందని, వేసవి దుక్కులకు మేలు చేసిందని హర్షం వ్యక్తం చేశారు. పొలాల్లో పశుగ్రాసం పెరుగుతుందని, పాడి పశువులకు ఎంతో మేలు కలుగుతుందని చెబుతున్నారు.

జిల్లాలో పలు ప్రాంతాల్లో నమోదైన వర్షపాతం

ప్రాంతం	సె.మీలలో
యలమంచిలి (కొక్కిరాపల్లి)	4.5
పరవాడ	3.5
నర్సీపట్నం	3.4
అనకాపల్లి	3.3
గొలుగొండ	3.2
అచ్యుతాపురం	2.9
రాంబిల్లి	1.8
దేవరాపల్లి	1.7
చీడికాడ	1.7
ఎస్.రాయవరం	1.4
రావికమతం	1.1
కె.కోటపాడు	0.9
కోటవురట్ల	0.3



యలమంచిలి రైల్వేస్టేషన్ రోడ్డుపై వర్షపు నీరు



చెరువులా మారిన రాజీవ్ క్రీడా మైదానం

తుఫాన్ హెచ్చరికలతో రెవెన్యూ అధికారులు అప్రమత్తం

అచ్యుతాపురం: తుఫాన్ హెచ్చరికలతో రెవెన్యూ అధికారులు అప్రమత్తం అయ్యారు. తీర ప్రాంతాలైన అచ్యుతాపురం, రాంబిల్లి మండలాల్లో వీఆర్వోలకు హెడ్ క్వార్టర్‌లో ఉండాలని ఆయా శాఖల ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. ప్రస్తుతం వేట విరామ సమయం కావడంతో మత్స్యకారులంతా ఆయా గ్రామాల్లో ప్రత్యామ్నాయ పనుల్లో ఉన్నారు. వలల అల్లికలు, బోటు రిపేర్ పనుల్లో నిమగ్నమయ్యారు. వారి విషయంలో ఎటువంటి ఆందోళన ఉండదని ఆ శాఖ అధికారులు చెబుతున్నారు. ఎన్నికల కౌంటింగ్ సంబంధించిన పనుల్లో ఉన్న రెవెన్యూ అధికారులకు తుఫాన్ హెచ్చరికలు కాస్త ఇబ్బంది కలిగిస్తున్నాయి.

పిడుగు పాటుతో మహిళ మృతి



మృతి చెందిన వంటాకుల గణేశ్వరి

రోలుగుంట: మండలంలోని కొమరవోలులో వంటాకుల గణేశ్వరి(39) శుక్రవారం పిడుగుపాటుకు గురై మృతి చెందింది. సాయంత్రం తన కళ్లానికి వచ్చి గేదెలను మేతకు తోలుకెళ్లింది. ఇక్కడ కొమరవోలు తల్లి గడి సమీపంలో గేదెలు కాస్తుండగా.. కొంత సేపటికి ఆకాశంలో ఉరుములు మెరుపులతోపాటు పెద్ద శబ్దంతో పిడుగు పడి ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. ఈమెకు భర్త తమ్మునాయుడు, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. గణేశ్వరి మరణంతో కుటుంబ సభ్యులు తీవ్రంగా రోదించారు. ఈ ప్రమాదం గురించి స్థానిక పోలీసులకు తహసీల్దార్‌కు ఫిర్యాదు చేసినట్టు వారు తెలిపారు.

మేఘాలలో తేలిపొమ్మన్నది..

మేఘాలలో తేలిపొమ్మన్నది.. తుపానులా రేగిపొమ్మన్నది.. అమ్మాయితో సాగుతూ చిలిపి మది.. అంటూ ఓ సినిమా కోసం సిరివెన్నెల సీతారామశాస్త్రి రచించిన గేయానికి సరితూగేలా ఓ అమ్మాయి మేఘాలలో తేలియాడింది. తుపాను వేళ తుపానులా రేగిపోయింది. ఆకాశంలో కారుమబ్బులు కమ్ముకుంటే ఆ ప్రకృతి సౌందర్యానికి తన్మయత్వం చెందింది. నీలి మబ్బులను అందుకోవాలన్న తపనతో నింగివైపు ఎగిరి గంతేసింది. ప్రకృతి రమణీయతను తనివి తీరా ఆస్వాదించింది. విశాఖ ఎయిర్‌పోర్టు వద్ద శుక్రవారం కనిపించిన అరుదైన ఆ దృశ్యాన్ని 'సాక్షి' క్లిక్ మనిపించింది. దానికి మువ్వన్నెల జెండా సాక్షిగా నిలిచింది.

- ఫోటో: సాక్షి ఫోటోగ్రాఫర్



క్లుప్తంగా

ఆర్‌ఎంపీ వైద్యుడి క్లినిక్ మూసివేతకు ఆదేశం

గొలుగొండ: ఏఎల్ పురంలోని ఆర్‌ఎంపీ వైద్యుడు రామ్‌దాస్ క్లినిక్‌ను మూసేయాలని కృష్ణదేవిపేట వైద్యాధికారి హరిప్రవీణ్ శుక్రవారం నోటీసులు జారీ చేశారు. వివరాలివి. లింగంపేట గ్రామానికి చెందిన చెల్లూరి సత్యనారాయణ అనారోగ్యంతో రామ్‌దాస్ వద్దకు వైద్యం కోసం వెళ్లాడు. సరైన వైద్య సేవలు అందించకపోవడంతో సత్యనారాయణ ఆరోగ్య పరిస్థితి విషమంగా మారి మరణించాడు. దీనిపై కుటుంబ సభ్యులు జిల్లా వైద్యాధికారులకు ఫిర్యాదు చేయగా, నర్సీపట్నం సీనియర్ వైద్యులు ప్రశాంతి గ్రామంలో విచారణ చేపట్టారు. ఈ విచారణలో రామ్‌దాస్ చికిత్సలో నిర్లక్ష్యం వహించినట్లు గుర్తించారు. దీనిపై జిల్లా వైద్యాధికారుల ఆదేశాల మేరకు ఈ నోటీసులు అందించినట్లు హరిప్రవీణ్ తెలిపారు. తదుపరి ఆదేశాల వరకు క్లినిక్ నిర్వహించరాదని ఆదేశించారు.

పాలిటెక్నిక్, గైస్‌కు ఎన్‌బీఏ గుర్తింపు

మురళీనగర్: కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలకు ఎన్‌బీఏ(నేషనల్ బోర్డ్ ఆఫ్ అక్రిడిటేషన్) గుర్తింపు లభించింది. జాతీయ స్థాయిలో సాంకేతిక కళాశాలకు డిప్లమో స్థాయిలో ఇచ్చే అత్యంత ప్రతిష్టాత్మక ఎన్‌బీఏ గుర్తింపు లభించడం ఇదే మొదటిసారి అని కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.నారాయణ రావు తెలిపారు. రాష్ట్ర సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ సి.నాగరాణి ఆదేశాల మేరకు కాలేజీ యాజమాన్యం ఎన్‌బీఏ గుర్తింపునకు అవసరమైన చర్యలు తీసుకుంది. ఇటీవల ఎన్‌బీఏ ప్రతినిధులు కాలేజీ సాధించిన ప్రగతి, క్రీడా సౌకర్యాలు, భవన సముదాయాలు. ప్రయోగశాలలు, సాంకేతిక విధానాల అమలు వంటి అంశాలను నిశితంగా పరిశీలించారు. ఈ మేరకు కళాశాలలోని మెకానికల్, సివిల్, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్, మెటలర్జీ విభాగాలకు 2027 జూన్ 30వ తేదీ వరకు ఎన్‌బీఏ గుర్తింపు మంజూరు చేసింది. ఎన్‌బీఏ గుర్తింపు సాధించడం కాలేజీ చరిత్రలో ఒక మైలురాయిగా నిలుస్తుందని ప్రిన్సిపాల్ సంతోషం వ్యక్తం చేశారు.

- కంచరపాలెంలోని ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగ్ ఇన్‌స్టిట్యూట్ (గైస్)కు నేషనల్ బోర్డ్ ఆఫ్ అక్రిడిటేషన్ (ఎన్‌బీఏ) గుర్తింపు లభించినట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వెంకటరమణ తెలిపారు. ఈ కాలేజీలో నాలుగు బ్రాంచీలు ఉండగా వీటిలో కెమికల్ ఇంజినీరింగ్, పెట్రో కెమికల్ ఇంజినీరింగ్ విభాగాలకు ఎన్‌బీఏ గుర్తింపునకు దరఖాస్తు చేశారు. ఇటీవల ఎన్‌బీఏ ప్రతినిధులు కాలేజీని సందర్శించి సౌకర్యాలను పరిశీలించారు. ఈ మేరకు ఈ రెండు విభాగాలకు ఎన్‌బీఏ గుర్తింపు మంజూరు చేశారు.

చదువుకున్న స్కూల్లో సభావేదిక నిర్మాణం



సభావేదిక ప్రారంభోత్సవంలో పాల్గొన్న పెద్దలు



లక్ష్మీనరసింహరాజును సన్మానిస్తున్న వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి శివాజీరాజు, తదితరులు

- రూ.10 లక్షలు వెచ్చించిన పూర్వ విద్యార్థి లక్ష్మీనరసింహరాజు

కె.కోటపాడు: తాను చదువుకున్న పాఠశాల అభివృద్ధికి ముందుకు వచ్చిన చౌడువాడకు చెందిన పూర్వ విద్యార్థి గణపతిరాజు లక్ష్మీనరసింహరాజు అభినందనీయుడని నన్నయ వర్సిటీ విశ్రాంత వైస్ చాన్స్‌లర్ ముర్రు ముత్యాలనాయుడు, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి దాట్ల శివాజీరాజు అన్నారు. లక్ష్మీనరసింహరాజు తన సొంత నగదు రూ.10 లక్షలతో గ్రామంలోని హైస్కూల్ ఆవరణలో సభావేదికను నిర్మించారు. ఈ సభావేదికను శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ముత్యాలనాయుడు, దాట్ల శివాజీరాజులు మాట్లాడుతూ ఎవరు ఎంత ఉన్నత స్థాయికి చేరుకున్నా, తమ ఉన్నతికి కారణమైన పాఠశాల, పుట్టిన గ్రామాన్ని మరువకూడదన్నారు. లక్ష్మీనరసింహరాజును గ్రామస్తులతో పాటు శివాజీరాజు, ముత్యాలనాయుడు, ఫారెస్ట్ అధికారి రామ్ నరేష్ బిర్లంగి, సర్పంచ్ దాడి ఎరుకునాయుడు, వైస్ ఎంపీపీ రొంగలి సూర్యనారాయణ, ఎంపీటీసీ ఏటుకూరి రాజేష్, రిటైర్డ్ ఎంఈవో దాట్ల చంద్రశేఖర్‌వర్మ ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం అప్పారావు, మార్కెట్ కమిటీ డైరెక్టర్ రాజి శ్రీనివాసరావు, దాట్ల రవిబాబు, రాళ్లపల్లి రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

పెద్దేరు ఆధునికీకరణ పనులు ప్రారంభం



పెద పిట్టగెడ్డ వద్ద పెద్దేరు ప్రధాన సాగునీటి కాలువకు సీసీ లైనింగ్ ఏర్పాటుకు శుభ్రం చేస్తున్న దృశ్యం

మాడుగుల: జిల్లాలోనే అధిక జలాశయాలు కలిగిన మాడుగుల నియోజకవర్గంలో ఏడు రిజర్వాయర్ల అభివృద్ధికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కంకణం కట్టుకుంది. ఇందులో భాగంగా మాడుగుల మండలం రావిపాలెం వద్ద పెద్దేరు ఆధునికీకరణ పనులు ప్రారంభమయ్యాయి. ఈ మేరకు కాలువల సీసీ లైనింగ్ పనులు చేయడానికి ముందుగా మట్టి దిబ్బలు, చెత్తాచెదారాలు లేకుండా శుభ్రం చేస్తున్నారు. ఇప్పటికే జలాశయం ఆధునికీకరణకు డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు కృషితో రూ.84.40 కోట్లు మంజూరయ్యాయి. ఈ పనులు పూర్తయితే మాడుగుల, బుచ్చెయ్యపేట, రావికమతం మండలాల్లో 20 వేల ఎకరాలు సస్యశ్యామలం అవుతాయని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. రూ.38 కోట్లతో నిర్మించిన పెద్దేరును 2006లో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ప్రారంభించి జాతికి అంకితం చేశారు. తర్వాత మరలా ఇప్పుడు ఆయన తనయుడు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక దృష్టి సారించడంతో ఇకపై వ్యవసాయానికి ఢోకా ఉండదని, శివారు ఆయకట్టు వరకు సాగునీరు అందనుందని రైతులు ధీమా వ్యక్తం చేస్తున్నారు.

కేజీహెచ్ డీసీఎస్ ఆర్‌ఎంవో సరెండర్

- ఇన్‌చార్జి డీసీఎస్ ఆర్‌ఎంవోగా డాక్టర్ భాస్కరరావు



డీసీఎస్ ఆర్‌ఎంవో డాక్టర్ లక్ష్మీతులసి



ఇన్‌చార్జి ఆర్‌ఎంవో డాక్టర్ భాస్కరరావు

మహారాణిపేట : కింగ్ జార్జి ఆస్పత్రి డిప్యూటీ సివిల్ సర్జన్ డి.లక్ష్మీతులసీని శుక్రవారం సరెండర్ చేశారు. ఈ మేరకు కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.అశోక్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. 8 నెలల క్రితం కేజీహెచ్ డీసీఎస్ ఆర్‌ఎంవోగా డాక్టర్ లక్ష్మీతులసీ బాధ్యతలు చేపట్టారు. ఫోరెన్సిక్ విభాగం వైద్యులు కొంత మంది ఆమె మీద రాష్ట్ర వైద్య విద్యా డైరెక్టర్ (డీఎంఈ) డాక్టర్ నరసింహానికి ఫిర్యాదు చేశారు. దీంతో ఇటీవల డీఎంఈ విచారణ చేపట్టారు. డీఎంఈ ఆదేశాల మేరకు కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.అశోక్‌కుమార్ డాక్టర్ లక్ష్మీతులసిని సరెండర్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. వాటిని శుక్రవారం అందజేశారు.

ఇన్‌చార్జి డీసీఎస్ ఆర్‌ఎంవోగా డా.భాస్కరరావు

డీసీఎస్ ఆర్‌ఎంవోగా డాక్టర్ ధవళ భాస్కరరావును నియమించారు. ఇప్పటి వరకు ఆయన కేజీహెచ్ ఏఆర్‌ఎంవోగా పని చేస్తున్నారు. ఇప్పుడు ఇన్‌చార్జి డీసీఎస్ ఆర్‌ఎంవోగా నియమితులయ్యారు. డాక్టర్ భాస్కరరావు గతంలో వైఎస్సార్ ఆరోగ్యశ్రీ జిల్లా సమన్వయకర్తగా పని చేశారు. ఉత్తరాంధ్ర జిల్లాల్లో పలు పోస్టుల్లో ఆయన సేవలందించారు.

బీబీ పట్నం నాడు-నేడు నిధుల దుర్వినియోగంపై విచారణ



బీబీ పట్నం హైస్కూల్ వద్ద రికార్డులు తనిఖీ చేస్తున్న అధికారులు జగదీష్, సత్యనారాయణ

రోలుగుంట: మండలంలోని బీబీ పట్నం హైస్కూల్‌కు ప్రభుత్వం మంజూరు చేసిన నాడు-నేడు నిధుల దుర్వినియోగంపై అధికారం బృందం శుక్రవారం తుది విచారణ చేపట్టింది. వివరాలివి. పాఠశాలలో అదనపు భవనాల నిర్మాణం, పునరుద్ధరణ పనులకు నాడు-నేడు రెండో విడతలో రూ.61 లక్షలు మంజూరయ్యాయి. అప్పటి(పూర్వ) హెచ్‌ఎం బాబూజీరావు పాఠశాల అభివృద్ధి కమిటీతో కలిసి ఈ పనులు చేపట్టారు. అయితే ముందుగానే చెక్‌లపై కమిటీ చైర్మన్ కిషోర్‌తో సంతకాలు చేయించి, నిధులు డ్రా చేసి, పనులు పూర్తి చేయకుండానే బదిలీపై వెళ్లిపోయారు. ఆయన స్థానంలో హెచ్‌ఎంగా ఎన్.అప్పారావు బాధ్యతలు స్వీకరించారు. అయితే నాడు-నేడు పనులకు సంబంధించిన రికార్డులు బాబూజీరావు అప్పగించలేదు. దీంతో పనులు ముందుకు సాగని పరిస్థితి. ఈ విషయాన్ని ఎంఈవోకు జానుప్రసాద్‌కు ప్రస్తుత హెచ్‌ఎం తెలిపారు. దీంతో ఆయన సమస్యను డీఈవోకు, కలెక్టర్‌కు నివేదించారు. గతేడాది నవంబరులో దీనిపై ప్రాథమిక విచారణ జరిపారు. తర్వాత ఎలాంటి కదలిక లేదు. తాజాగా ‘సాక్షి’లో నాడు-నేడు నిధుల దుర్వినియోగంపై ప్రచురితమైన వార్తకు అధికారులు స్పందించారు. దీని విచారణ బాధ్యతలను ఎస్ఎస్ఏ డీఈఈ జగదీష్‌కి అప్పగించారు. ఈ మేరకు ఆయన శుక్రవారం మండల ఏఈ సత్యనారాయణతో కలిసి బీబీ పట్నం వచ్చి నిధులు, జరిగిన పనులకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. హెచ్‌ఎం అప్పారావు వారికి అవసరమైన సమాచారం అందించారు. దీనిపై సమగ్ర విచారణ అనంతరం, తదుపరి చర్యల కోసం ఉన్నతాధికారులకు నివేదించనున్నట్లు మీడియాకు తెలిపారు.

‘నిజత్ కప్ -2025’ పోస్టర్ ఆవిష్కరణ



నిజత్ కప్ -2025 పోస్టర్ ఆవిష్కరిస్తున్న జపాన్ బృందం

తుమ్మపాల: వచ్చే ఏడాది ఫిబ్రవరి 7,8,9 తేదీల్లో నిర్వహించే రెండో ఇంటర్నేషనల్ ఓపెన్ కరాటే చాంపియన్ షిప్ పోటీల కోసం రూపొందించిన ‘నిజత్ కప్-2025’ పోస్టర్‌ను శుక్రవారం ఆవిష్కరించారు. నిజి షాటోకా స్పోర్ట్స్ కరాటే అసోసియేషన్ ఆఫ్ ఇండియా, నాయుడు సెల్ఫ్ డిఫెన్స్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన కరాటే శిక్షణ ముగింపు కార్యక్రమం పట్టణంలో వి.వి.రమణ రైతు భారతి ఆడిటోరియంలో జరిగింది. ఈ సందర్భంగా జపాన్‌కు చెందిన 10వ బ్లాక్ బెల్ట్ బృందం సభ్యులు విద్యార్థులను అభినందించి, బహుమతులు ప్రదానం చేశారు. అనంతరం పోస్టర్‌ను ఆవిష్కరించారు.

ఈ కార్యక్రమంలో దాడి రత్నాకర్, నాయుడు సెల్ఫ్ డిఫెన్స్ అకాడమీ అధ్యక్షుడు ఎస్.పి.ఎం.డి.నాయుడు, ఎస్.డి. గ్రూప్స్ చైర్మన్ కాండ్రేగుల శ్రీరామ్, నేషనల్ బాడీ బిల్డర్ ఎస్.బాబీ, జి.ఆనంద్ బాబు, ఎస్.కిశోర్‌కుమార్, ఎం.సుందరం, పి.నరసింహారావు, అసోసియేషన్ ప్రతినిధులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

రేపు గీతం ప్రవేశ పరీక్ష

కొమ్మాది: గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలో ఇంజినీరింగ్, ఫార్మసీ, ఆర్కిటెక్చర్, మేనేజ్‌మెంట్, సైన్స్, లా, నర్సింగ్, పారా మెడికల్ కోర్సుల్లో ప్రవేశానికి నిర్వహిస్తున్న ఉమ్మడి ప్రవేశ పరీక్ష గీతం అడ్మిషన్ టెస్ట్ (గ్యాట్) -2024కు ఏర్పాట్లు పూర్తయ్యాయి. దేశ వ్యాప్తంగా ఎంపిక చేసిన పట్టణాల్లో ఈ నెల 26న ఆన్‌లైన్ విధానంలో ఈ పరీక్ష నిర్వహిస్తున్నారు. ప్రవేశ పరీక్షలో లభించిన మార్కుల ఆధారంగా వివిధ కోర్సుల్లో ప్రవేశాలు కల్పిస్తారు. ప్రతిభ కల విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు అందిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం

నక్కపల్లి: విశాఖ నుంచి హైదరాబాద్ వెళ్తున్న ప్రైవేట్ ట్రావెల్ బస్సుకు త్రుటిలో పెద్ద ప్రమాదం తప్పింది. బస్సులో ప్రయాణిస్తున్న 36 మంది ప్రయాణికులు సురక్షితంగా బయటపడ్డారు. శుక్రవారం సాయంత్రం బస్సు విశాఖ నుంచి బయల్దేరింది. ఉద్దండపురం సమీపంలోకి రాగానే అదుపు తప్పి ముందు వెళ్తున్న కంటైనర్‌ను ఢీకొంది. బస్సును వెనుక నుంచి మరో లారీ ఢీకొట్టింది. ఈ ఘటనలో బస్సు ముందు, వెనుక భాగాలు నుజ్జయ్యాయి. ప్రయాణికులకు మాత్రం ఏం కాలేదు. వారిని వేరొక బస్సులో పంపించారు.

దేవరాపల్లిలో భారీగా వాహనాలు స్వాధీనం



దేవరాపల్లి పోలీస్‌స్టేషన్ ఆవరణలో స్వాధీనం చేసుకున్న బైక్‌లు, ఆటోలు. (ఇన్‌సెట్) వాహనాల రికార్డులను తనిఖీ చేస్తున్న కె.కోటపాడు సీఐ స్వామినాయుడు

- 55 బైక్‌లు, రెండు ఆటోలు పోలీస్‌స్టేషన్‌కు తరలింపు

దేవరాపల్లి: మండల కేంద్రం దేవరాపల్లిలో శుక్రవారం పోలీసులు భారీగా వాహనాలు స్వాధీనం చేసుకున్నారు. ఎస్పీ ఆదేశాల మేరకు కార్డెన్ అండ్ సెర్చ్ ఆపరేషన్‌లో భాగంగా వాహనాలు తనిఖీ చేశారు. కె.కోటపాడు సీఐ బి.సీహెచ్.స్వామినాయుడు ఆధ్వర్యంలో అనకాపల్లి సబ్ డివిజన్ పరిధిలోని పోలీసులు తనిఖీలు జరిపి, రికార్డులు లేని 55 ద్విచక్ర వాహనాలు, రెండు ఆటోలు స్వాధీనం చేసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. వాహనం నడిపే ప్రతి ఒక్కరూ తమ వెంట రికార్డులు తప్పనిసరిగా ఉంచుకోవాలని దేవరాపల్లి ఎస్ఐ డి.నాగేంద్ర తెలిపారు. రికార్డులు లేని వాహనాలను సీజ్ చేస్తామని స్పష్టం చేశారు. తనిఖీల్లో పట్టుకున్న వాహనాలకు సంబంధించిన రికార్డులు చూపించి తీసుకువెళ్లవచ్చన్నారు. అనంతరం సీఐ స్వామినాయుడు మాట్లాడుతూ ప్రశాంత వాతావరణంలో కౌంటింగ్ జరిగేలా పటిష్టమైన భద్రత చర్యలు తీసుకుంటున్నట్టు చెప్పారు. ఎన్నికల ఫలితాలు వెలువడనున్న క్రమంలో గ్రామాల్లో అవాంఛనీయ ఘటనలు జరగకుండా చర్యలు చేపట్టినట్టు చెప్పారు. అనుమానాస్పద ప్రాంతాల్లో కార్డెన్ అండ్ సెర్చ్ ఆపరేషన్లను నిర్వహిస్తున్నామని తెలిపారు.

దేవరాపల్లిలో చెరకు తోట దగ్ధం

- రూ. 2 లక్షల మేర ఆస్తినష్టం



కాలిపోయిన చెరకుతోట, పైపులను చూపిస్తున్న బాధిత రైతు

దేవరాపల్లి: అగ్ని ప్రమాదంలో చెరకు తోట దగ్ధమైంది. రూ. 2 లక్షల మేర ఆస్తినష్టం వాటిల్లింది. శుక్రవారం మధ్యాహ్నం దేవరాపల్లిలో ఈ ఘటన చోటు చేసుకుంది. రైతు కొల్లి దొంగబాబుకు చెందిన 50 సెంట్లలో వేసిన చెరకు తోట కాలిపోతున్న సమయంలో చుట్టుపక్కల రైతులు ఎవరూ లేకపోవడంతో మంటలను అదుపు చేసే పరిస్థితి లేకుండా పోయింది. ఆరుగాలం కష్టపడి సాగు చేసిన చెరకు తోటతోపాటు సాగు నీరందించే పైపులు సైతం కాలి బూడిదయ్యాయని బాధిత రైతు బోరున విలపించాడు. గతేడాది ఇదే పొలంలో పంట ద్వారా రూ.1.50 లక్షల మేర ఆదాయం వచ్చిందని చెప్పాడు. అధికారులు స్పందించి ఆదుకోవాలని కోరుతున్నాడు.

రైలు నుంచి జారి పడి వ్యక్తి మృతి



పాయకరావుపేట: రైలు నుంచి జారి పడి వ్యక్తి మృతి చెందినట్లు తుని రైల్వే ఎస్ఐ షేక్ అబ్దుల్ మారుఫ్ తెలిపారు. పట్టణంలోని ఇందిరాకాలనీ రైల్వే బ్రిడ్జి సమీపాన శుక్రవారం మధ్యాహ్నం విశాఖ నుంచి విజయవాడ వెళ్తున్న గుర్తు తెలియని రైలు నుంచి సుమారు 40 సంవత్సరాల వయసున్న వ్యక్తి జారిపడి మృతి చెందినట్లు పేర్కొన్నారు. మృతుడు స్కై బ్లూ కలర్ జీన్ ప్యాంటు, స్లీవ్‌లెస్ బనియన్ ధరించి ఉన్నాడన్నారు. అతని వద్ద నున్న ఆధార్‌కార్డు ఆధారంగా వివరాలు పరిశీలిస్తున్నట్లు తెలిపారు. మృతదేహాన్ని తుని ప్రభుత్వ ఆస్పత్రిలో భద్రపర్చి, కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

తోట చెరువులో వ్యక్తి మృతదేహం

- అనుమానాస్పద మృతిగా కేసు నమోదు



చెరువులో నుంచి బయటకు తీసిన మృతదేహం

యలమంచిలి రూరల్: మండలంలోని తండాలదిబ్బ కూడలికి సమీపంలో ఉన్న తోట చెరువులో శుక్రవారం గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం బయటపడినట్లు యలమంచిలి రూరల్ పోలీసులు మీడియాకు తెలిపారు. చెరువులో మునిగేంత నీరు లేకపోయినా వ్యక్తి ఎలా చనిపోయాడన్న దానిపై పోలీసులు లోతుగా దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహం బాగా కుళ్లిపోయి, దుర్వాసన వస్తోంది. నాలుగు రోజుల క్రితమే చెరువులో మృతదేహం పడి ఉండవచ్చని గుర్తించిన పోలీసులు, అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు. దీనికి సంబంధించి యలమంచిలి సీఐ షేక్ గఫూర్, కొక్కిరాపల్లి గ్రామస్తులు తెలిపిన వివరాలు. కొక్కిరాపల్లి గ్రామపరిధి ప్రేమ సమాజం సమీపంలో ఉన్న తోట చెరువులో శుక్రవారం చేపలు పట్టేందుకు కొందరు వ్యక్తులు వెళ్లారు. వారికి చెరువులో సుమారు 35 ఏళ్ల వయసున్న వ్యక్తి మృతదేహం కనిపించింది. వెంటనే స్థానిక వార్డు కౌన్సిలర్ మజ్జి రామకృష్ణకు చెప్పగా, ఆయన పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే అక్కడికి చేరుకున్న పోలీసులు పరిసరాలతో పాటు మృతదేహాన్ని క్షుణ్ణంగా పరిశీలించారు. మృతదేహం బాగా కుళ్లి, ఉబ్బిపోయింది. మృతుడి ప్యాంటు ఊడిపోయి ఉండటం, చెరువులో పెద్దగా నీరు లేకపోవడం, శరీరంపై గాయాలు ఉండటంతో ఎవరైనా హత్య చేసి ఉండవచ్చన్న కోణంలో దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని అనకాపల్లి మార్చురీలో భద్రపరిచారు. ఉమ్మడి విశాఖ జిల్లాతో పాటు అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో నమోదైన మిస్సింగ్ కేసుల వివరాలను పరిశీలిస్తున్నట్లు సీఐ గఫూర్ తెలిపారు.

క్లుప్తంగా

వేట నిషేధ భృతి విడుదల చేయాలి

అనకాపల్లి: ఈ ఏడాది ఏప్రిల్ 14 నుంచి సముద్రంలో చేపల వేట నిషేధం అమల్లోకి రావడంతో మత్స్యకారులు వేటకు వెళ్లలేదని, వారికి ఇవ్వాల్సిన భృతిని తక్షణమే చెల్లించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి కె.లోకనాథం శుక్రవారం ఓ ప్రకటనలో కోరారు. మత్స్యకారులు వేట నిషేధం అమలుతో జీవనోపాధి లేక రోజువారీ అవసరాలకు నానా అవస్థలు పడుతున్నార న్నారు. ప్రభుత్వం గతేడాది రూ.10 వేలు ఇచ్చిందన్నారు. ఈసారి కుటుంబ పోషణ కోసం ఇంట్లో ఉన్న బంగారు వస్తువులు తాకట్టు పెట్టుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే మత్స్యకారులకు చెల్లించాల్సిన వేట నిషేధ భృతిని విడుదల చేయాలని కోరారు.

అన్నమయ్య సంకీర్తనలతో ఆధ్యాత్మిక తన్మయత్వం



కొండవీటి జ్యోతిర్మయిని సత్కరిస్తున్న నిర్వాహకులు

అగనంపూడి: అన్నమయ్య సంకీర్తనలతో ఆధ్యాత్మి క తన్మయత్వానికి లోనవుతామని తిరుమల తిరుపతి దేవస్థానం ఆస్థాన గాయకురాలు కొండవీటి జ్యోతిర్మయి అన్నారు. వడ్లపూడిలో కాపారపు ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నమ య్య సంకీర్తనా యజ్ఞంలో ఆమె పాల్గొని, మాట్లాడారు. ఐదు రోజుల పాటు నిర్వహించిన కార్యక్రమంలో సంకీర్తనా రాయబారిగా ఆమె ప్రవచనాలు, సంకీర్తనల ఝరిలో ఆధ్యాత్మికవేత్తలు, సామాజిక వేత్తలు ఓలలాడారు. కాపారపు ఫౌండేషన్ అధినేత కాపారపు శివన్నాయుడు, వార్డు కార్పొరేటర్ బొండా జగన్నాథం, బ్రహ్మశ్రీ భాస్కర భట్ల సత్య ప్రసాద్ శర్మ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. గీతాచార్య భక్తి గీతాంజలి యజ్ఞం శ్రీ గౌరీసేవా సంఘం ఆధ్వర్యంలో కొనసాగిన కార్యక్రమంలో వివిధ ప్రాంతాల నుంచి గాయకులు, సంకీర్తనాభిమానులు, ఆధ్యాత్మికవేత్తలు హాజరయ్యారు. కార్యక్రమంలో డాక్టర్ పేడాడ హేమలత, ఆధ్యాత్మికవేత్తలు అట్లూరి రమేష్, అద్దంకి రాఘవాచార్యులు పాల్గొన్నారు.

బాణసంచా, మైక్ నిషేధం

మునగపాక: గ్రామాల్లో ఎటువంటి కార్యక్రమాలు నిర్వహించినా బాణసంచా కాల్చరాదని, మైక్‌సెట్, సౌండ్ బాక్స్‌లు ఏర్పాటు చేయరాదని ఎస్ఐ పి.ప్రసాదరావు ఓ ప్రకటనలో తెలిపారు. ఉత్సవాలు, శుభ కార్యక్రమాల నిర్వహణ సమయంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియ ముగిసేంతవరకు అప్రమత్తంగా ఉండాలన్నారు.

అనకాపల్లి సినిమాలు

దర్టీ ఫెలో	: రాజా
ఫ్యూరియోసా	: సత్యనారాయణ స్క్రీన్-1
వ్యాన్	: సత్యనారాయణస్క్రీన్-2
బాక్	: షిర్డిసాయి
ఆ ఒక్కటీ అడక్కు	: పర్తిసాయి
రాజుయాదవ్	: వెంకటేశ్వర
సిల్క్ శారీ	: శ్రీసత్య
కృష్ణమ్మ	: రామచంద్ర

బెల్లం ధరలు



అనకాపల్లి మార్కెట్‌కు శుక్రవారం 459 బెల్లం దిమ్మలు వచ్చాయి

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
స్పెషల్ రకం	4,260	5,180
మొదటి రకం	4,260	5,000
రెండో రకం	3,940	4,600
మూడోరకం	3,550	4,080

రక్త నిల్వలు

అనకాపల్లి: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 90 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-10 యూనిట్లు, బీ పాజిటివ్-45 యూనిట్లు, బీ నెగిటివ్-1 యూనిట్, ఓ పాజిటివ్-30 యూనిట్లు, ఓ నెగిటివ్-1 యూనిట్, ఏబీ పాజిటివ్-2 యూనిట్లు, ఏబీ నెగిటివ్-1 యూనిట్ శుద్ధి చేసిన రక్తం నిల్వఉంది. అవసరమైన వారు వైద్యా లయం బ్లడ్‌బ్యాంకు టెక్నీషియన్ యు.లోకేష్ (9703619706)ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా శుక్రవారం 411 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 354 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్‌గ్యాస్ ఏజెన్సీ(0892 4223595)ని సంప్రదించవచ్చు.

ఆయుర్వేదం.. అద్భుత వైద్యం

ఆయుర్వేదం.. ప్రాచీన భారతీయ వైద్యం. సైడ్ ఎఫెక్ట్స్‌కు తావులేని చికిత్సా విధానం. అందుకే నేటికీ ఆయుర్వేదంపై ప్రజలకు అంత నమ్మకం. కరోనా తర్వాత ఆ నమ్మకం పదింతలయింది. అందుకు కశింకోటలోని కన్నూరుపాలెం ప్రభుత్వ ఆయుర్వేద ఆస్పత్రికి రోజురోజుకూ పెరుగుతున్న ఆదరణే నిదర్శనం. వందేళ్ల చరిత్ర కలిగిన ఈ ఆయుర్వేద వైద్య నిలయం ప్రస్తుతం మరింత ఆధునిక వసతులతో రోగులకు సేవలందిస్తోంది.



కన్నూరుపాలెంలో ఉన్న ప్రభుత్వ ఆయుర్వేద ఆస్పత్రి



ఆస్పత్రి ఆవరణలో పెంచుతున్న ఆయుర్వేద ఔషధ మొక్కలు

- కన్నూరుపాలెం ఆయుర్వేద ఆస్పత్రికి ఆదరణ
- ప్రభుత్వ సహకారంతో పెరిగిన వసతులు
- షెడ్ ఏర్పాటైతే అందుబాటులోకి పంచకర్మ చికిత్స
- దాతల ఆర్థిక సాయం కోసం నిరీక్షణ

కశింకోట: మండలంలోని కన్నూరుపాలెంలో ఉన్న ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాలకు క్రమేపీ ఆదరణ పెరుగుతోంది. సుదూర ప్రాంతాల నుంచి రోగులు ఆస్పత్రికి వచ్చి వైద్య సేవలు పొందుతున్నారు. ఆస్పత్రిలో ఆధునిక సదుపాయలు కల్పించి వైద్య సేవలు మెరుగుపర్చారు. వైద్యుల ఆదరణ, దుష్ప్రభావాలకు తావులేని చికిత్స కావడంతో ఆయుర్వేదిక్ వైద్య విధానం పట్ల ప్రజలు మక్కువ చూపుతున్నారు.

వైద్యంలో వందేళ్ల చరిత్ర

కన్నూరుపాలెం ఆయుర్వేద ఆస్పత్రికి సుమారు వందేళ్ల చరిత్ర ఉంది. శిథిల భవనంలో నడిచే ఆస్పత్రికి దశాబ్దం క్రితం మరో భవనం నిర్మించారు. ప్రస్తుత ప్రభుత్వం దాన్ని సుమారు రూ.5 లక్షలు వెచ్చించి ఆరు నెలల క్రితం అన్ని సదుపాయాలు కల్పించింది. ఆస్పత్రి పరిసరాలను ఆహ్లాదకరంగా తీర్చిదిద్దింది. దాదాపు అన్ని వ్యాధులకు మందులు, ఆధునిక పరికరాలను అందుబాటులోకి తెచ్చారు. దీంతో స్థానికులతోపాటు నర్సీపట్నం, మాకవరపాలెం, హరిపాలెం తదితర దూర ప్రాంతాల నుంచి రోగులు వచ్చి వైద్య సేవలు పొందుతున్నారు.

అవగాహన పెరిగింది

గతంలో స్థానికులు మాత్రమే అదికూడా అరకొరగా ఆస్పత్రి సేవలు వినియోగించుకునే వారు. గత కొన్ని మాసాలుగా ఆస్పత్రి వైద్యులు ఆయుర్వేద వైద్యం పట్ల ప్రజల్లో అవగాహన పెంచుతున్నారు. విద్యా సంస్థలు, గ్రామాల్లో వైద్య శిబిరాలు నిర్వహించి, ఆయుర్వేద వైద్యం, యోగా, ధ్యానం ప్రయోజనాలను ప్రచారం చేస్తున్నారు. ఆస్పత్రి ఆవరణలోనే ఆయుర్వేద ఔషధ మొక్కల పెంపకం చేపట్టారు. వాటిపై ఆస్పత్రికి వచ్చే రోగులకు అవగాహన కలిగిస్తున్నారు. దీంతో ప్రజల్లో మార్పు వచ్చింది. ఆస్పత్రి ఆవరణలో ప్రత్యేక షెడ్ ఏర్పాటుకు దాతల కోసం సిబ్బంది ఎదురు చూస్తున్నారు. త్వరలో పంచకర్మలు అందుబాటులోకి తీసుకురావాలని యోచిస్తున్నారు.

సదుపాయాలు మెరుగు



గతంలో ఆయుర్వేద ఆస్పత్రికి అంత ఎక్కువ సంఖ్యలో రోగులు వచ్చేవారు కాదు. మేం కూడా ఎక్కువగా ఇంగ్లిష్ మందులే వాడేవాళ్లం. కరోనా సమయంలో ఆయుర్వేద మందులు బాగా పనిచేశాయి. దీనికితోడు ప్రభుత్వ ఆయుర్వేద ఆస్పత్రిలో సదుపాయాలు మెరుగుపర్చారు. చాలా వ్యాధులకు అవసరమైన మందులన్నీ ఆస్పత్రిలోనే ఉచితంగా ఇస్తున్నారు. దీంతో చాలా సమస్యలకు ఆయుర్వేద మందులే వేసుకుంటున్నాం. పక్క గ్రామాల నుంచీ రోగులు ఇప్పుడు వస్తున్నారు.

– కూండ్రపు అచ్చియ్యనాయుడు, కన్నూరుపాలెం

నమ్మకం పెరిగింది



ఆయుర్వేద ఆస్పత్రికి స్థానికులతోపాటు సుదూర ప్రాంతాల నుంచి రోగులు వస్తున్నారు. ఆయుర్వేద వైద్యంపై రోగుల్లో నమ్మకం పెరిగింది. తరచూ వైద్య శిబిరాలు నిర్వహించి ఆయుర్వేద వైద్య విధానంపై అవగాహన కల్పిస్తున్నాం. దీంతో రోగుల సంఖ్య పెరుగుతోంది. రోజూ కనీసం 25 మందికి చికిత్స అందిస్తున్నాం. ఆస్పత్రిలో రోగులకు అవసరమైన ఆధునిక పరికరాలు, వసతుల్ని ప్రభుత్వం కల్పించింది. సీజనల్ వ్యాధులతోపాటు దీర్ఘ కాలిక వ్యాధులకూ వైద్యం అందిస్తున్నాం.

– డా.టి.శిరీష, వైద్యాధికారి, ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాల, కన్నూరుపాలెం

వర్షంతో ఉపశమనం

పట్టణ పరిధిలో 24.6 మి.మీ. వర్షపాతం



మెయిన్‌రోడ్డు నెహ్రూచౌక్ రహదారిలో కురుస్తున్న వర్షం

అనకాపల్లి: అధిక ఉష్ణోగ్రత, ఉక్కబోతతో అల్లాడిన పట్టణ ప్రజలు సాయంత్రం కురిసిన వర్షానికి సేద దీరారు. గత కొన్ని రోజులుగా పగటి ఉష్ణోగ్రతలకు చిన్నారులు, వృద్ధులు ఇంటి నుంచి బయటికి వచ్చేందుకు భయపడుతున్నారు. శుక్రవారం పట్టణంలో పగటి ఉష్ణోగ్రత 36.8 డిగ్రీలుగా నమోదయింది. సాయంత్రం 4 గంటల సమయంలో ఒక్కసారిగా ఆకాశం మబ్బులుపట్టి చల్లని గాలులు వీచాయి. అనంతరం చాలా సేపు వర్షం కురిసింది. పట్టణ పరిధిలో 24.6 మి.మీ. వర్షపాతం నమోదయింది. వాతావరణం చల్లబడటంతో ప్రజలు ఉపశమనం పొందారు. రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ముమ్మరంగా జరుగుతున్న వేసవి దుక్కులకు ఈ వర్షం మరింతగా ఉపయోగపడుతుందని చెప్తున్నారు.

తుమ్మపాల: మండలంలో శుక్రవారం మధ్యాహ్నం ఓ మోస్తరు వర్షం కురిసింది. సుమారు గంట పాటు మబ్బులుపట్టి, ఎడతెరిపి లేకుండా కుండపోతగా కురిసిన వర్షానికి పంట పొలాల్లో నీరు చేరింది. ఓ పక్క వేసవి దుక్కులు జరుగుతుండగా మరో పక్క వర్షం పడటంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. కురిసిన వర్షం పశువుల మేతతో పాటు కూరగాయలు, పండ్ల తోటలకు అనుకూలంగా ఉంది. ఈ ఏడాది త్వరగానే రుతుపవనాలు వస్తున్నాయని ఖరీఫ్ పంటల సాగుకు అనువైన వాతవరణం ఏర్పడుతుందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

కశింకోట: మండల పరిధిలో శుక్రవారం మధ్యాహ్నం ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. వాతావరణం చల్లబడింది. ప్రజలు ఉపశమనం పొందారు. గత కొద్ది రోజులుగా వేసవి తాపంతో సతమతమవుతున్న ప్రజలకు వర్షపు జల్లులు ఉపశమనం కలిగించాయి. ఈ వర్షం చెరకు తోటలకు ఉపకరిస్తుందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

యోగాతో ఆరోగ్యకర జీవనం



జార్నలిక్లబ్‌లో యోగాసనాలు వేస్తున్న ట్రస్ట్ సభ్యులు



స్విమ్మింగ్ పూల్‌లో యోగాసనాలు వేస్తున్న ట్రస్ట్ సభ్యులు

ఘనంగా భారత స్వాభిమాన్ ట్రస్ట్ వార్షికోత్సవం

అనకాపల్లి: నిత్యం యోగాతో ఆరోగ్యంగా జీవించవచ్చని భారత స్వాభిమాన్ ట్రస్ట్, పతంజలి యోగ సమితి జిల్లా అధ్యక్షుడు భీశెట్టి దొరమ్మనాయుడు తెలిపారు. స్థానిక జార్నలిక్లబ్ ఆవరణలో ట్రస్ట్ ద్వితీయ వార్షికోత్సవం సందర్భంగా శుక్రవారం ప్రత్యేక యోగాసనాలు, స్విమ్మింగ్ తదితర కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కరోనా తర్వాత యోగాపై ప్రజల్లో ఆసక్తి పెరిగిందన్నారు. వయస్సుతో సంబంధం లేకుండా ఉదయం, సాయంత్రం సమయంలో యోగాసనలు వేయడం ద్వారా చాలా వ్యాధుల నుంచి విముక్తి పొందవచ్చన్నారు. దశల వారీగా పలు ప్రాంతాల్లో యోగా కేంద్రాలను ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. ద్వితీయ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని మూడు రోజులపాటు పలు కార్యక్రమాలు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. తొలి రోజు కార్యక్రమంలో భాగంగా ఈశ్వర్ స్విమ్మింగ్ పూల్‌లో శ్వాసపై ధ్యాస పెంపొందించేందుకు జలాసనాలు నిర్వహించినట్లు తెలిపారు. 25న యోగాపై అవగాహన కార్యక్రమాలు, 26న పతంజలి యోగపీఠ్, హరిద్వారకు చెందిన పూజ్యస్వామి రిత్ దేవ్ మహారాజ్ జీ, జొన్నలగడ్డ శ్రీనివాసులు విచ్చేయనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు బీఎస్ఎంకే జోగినాయడు, బుద్ద కాశీవిశ్వనాథ్, సభ్యులు వి.చంద్రశేఖర్, బీమశెట్టి శ్రీనివాసరావు, జి.మంగయ్య, కేవీవీ సత్యనారాయణ, కాండ్రేగుల చిన్న, కోలాపర్తి కన్నబాబు, పెంటకోట సుబ్రహ్మణ్యం, కర్రి గంగాధర్, రోహిణి, రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

యువతకు యూనియన్ బ్యాంకు రుణ ఆసరా

15 రోజుల్లో రూ.32.35 కోట్ల రుణాల మంజూరు



లోన్ ద్వారా తీసుకున్న కారుకు తాళం అందిస్తున్న యూనియన్ బ్యాంక్ డీజీఎం శంకర్‌హోమ్‌రామ్

అనకాపల్లి: విద్యార్థులు ఉన్నత చదువులు చదివేందుకు ప్రభుత్వ ఆదేశాల మేరకు బ్యాంకుల ద్వారా ఎడ్యుకేషన్ లోన్లు మంజూరు చేస్తున్నట్లు యూనియన్ బ్యాంక్ డిప్యూటీ జనరల్ మేనేజర్ శంకర్‌హోమ్‌రామ్ తెలిపారు. స్థానిక రింగ్‌రోడ్డులోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్లో బ్యాంక్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన మెగా రిటైల్ ఎక్స్‌పో–2024కు ఆయన ముఖ్య అతిథిగా హాజరై, మాట్లాడారు. అనకాపల్లి పట్టణ పరిధిలో 23 యూనియన్ బ్యాంకు శాఖలు ఉన్నాయని, వాటి ద్వారా 15 రోజుల్లో హౌసింగ్, వెహికల్, ఎడ్యుకేషన్ లోన్ల రూపంలో రూ.32.35 కోట్లు మంజూరు చేసినట్లు వెల్లడించారు. ప్రభుత్వాలు ఆదేశాల మేరకు చిరువ్యాపారాల నుంచి పెద్దపెద్ద కంపెనీల ఏర్పాటు వరకు నిరుద్యోగ యువతీ, యువకులకు సబ్సిడీ లోన్లు అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో యూనియన్ బ్యాంక్ రీజనల్ మేనేజర్ నరేష్, బ్యాంకుల చీఫ్ మేనేజర్లు దుర్గాప్రసాద్, మనీష్ కుమార్, పి.వి.ప్రసాద్, ఉద్యోగులు సత్యనారాయణ, చంద్రశేఖర్, ఖాతాదారులు పాల్గొన్నారు.

చురుగ్గా గంగాలమ్మ గుడి నిర్మాణం



మూలపేటలోని నిర్మాణంలో ఉన్న గంగాలమ్మతల్లి గుడి

మునగపాక: మండలంలోని మూలపేటలో గంగాలమ్మ తల్లి గుడి నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. గతంలో ఉన్న ఆలయం జీర్ణావస్థకు చేరుకోవడంతో నూతన ఆలయం నిర్మాణానికి గ్రామస్తులు శ్రీకారం చుట్టారు. గ్రామస్తుల విరాళాలతో ఆలయ నిర్మాణ పనులు ప్రారంభించారు. ప్రస్తుతం ఆలయ నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. దాతలు ముందుకొచ్చి ఆలయ నిర్మాణంలో భాగస్వామ్యం కావాలని సర్పంచ్ బీశెట్టి గంగప్పలనాయుడు కోరారు.

ఉపాధి కూలీలకు రూ. 300 చెల్లించాలి



సమావేశంలో మాట్లాడుతున్న గనిశెట్టి

పరవాడ: ఉపాధి కూలీలకు కొలతలతో పనిలేకుండా రోజు కూలి రూ.300 చెల్లించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు. ఈ.బోనంగిలో శుక్రవారం ఉపాధి కూలీలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రోజు కూలీగా రూ.300 చెల్లించాలని కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. ఏ రోజు ఎంత వేతనం పడుతుందో తెలిసే విధంగా పే స్లిప్‌లు ఇవ్వాలన్నారు. ఉపాధి కూలీలకు పెరిగిన ధరలకు అనుగుణంగా రేట్లు పెంచి ఇవ్వాలన్నారు. మండుటెండలో పనిచేస్తున్న ఉపాధి కూలీలకు మజ్జిగ, మంచినీరు అందుబాటులో ఉంచాలన్నారు. 15 రోజులకో సారి వేతనాలు చెల్లించాలన్నారు. ఏడాదికి 200 పని దినాలు కల్పించాలని గనిశెట్టి డిమాండ్ చేశారు. సమావేశంలో శేషమ్మ, అప్పారావు, రమణ, లక్ష్మి, అప్పల నరసింహ, పార్వతి తదితరులు పాల్గొన్నారు.

పాలిసెట్ ర్యాంకర్లకు అభినందన



పాలిసెట్ ర్యాంకర్లతో రమణ, శ్రీను

దేవరాపల్లి: పాలిసెట్‌లో ప్రతిభ చూపిన విద్యార్థులను ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు కె.వి.రమణ అభినందించారు. ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక మండలాధ్యక్షుడు కొరుపోలు శ్రీను ఆధ్వర్యంలో స్థానిక ఉషోదయ స్కూల్‌లో ఏప్రిల్ నుంచి ఉచిత పాలిటెక్నిక్ శిక్షణ ఇస్తున్నారు. ఇక్కడ మండల వ్యాప్తంగా 120 మంది విద్యార్థులు తర్ఫీదు పొందారు. వీరిలో ఇటీవల విడుదల చేసిన ఫలితాల్లో బుగత యమున, రాయపురెడ్డి శ్రీహరి, బూడి దుర్గాప్రసాద్, లెక్కల శిరీషా, గొర్లి శ్రావ్య తదితరులు ఐదు వేలలోపు ర్యాంక్‌లను సాధించారు. నెల రోజు శిక్షణలోనే ప్రతిభ చూపిన వీరిని శుక్రవారం కె.వి.రమణ అభినందించారు. గ్రామీణ పేద విద్యార్థులను విద్యాపరంగా మరింత ప్రోత్సహించడంలో భాగంగా నాలుగేళ్లుగా ఉచిత పాలిటెక్నిక్ శిక్షణ ఇవ్వడం ఎంతో సంతృప్తినిస్తుందన్నారు. కోచింగ్ నిర్వాహకుడు శ్రీనుతోపాటు బోధకులు కె.జ్ఞానేశ్వరరావు, రమేష్, సురేష్, అజయకుమార్‌లను ఉషోదయ స్కూల్ డైరెక్టర్లు పెద్దాడ వెంకటరమణ, వేచలపు అప్పలనాయుడు తదితరులు అభినందించారు.

రోలుగుంటలో హనుమానోత్సవాలు ప్రారంభం



స్వామివారికి పూజలు చేస్తున్న హనుమాన్ మాలధారణ భక్తులు

రోలుగుంట: స్థానిక బందారు వీధిలో హనుమాన్ ఆలయం వద్ద హనుమానోత్సవాలు శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉత్సవాల సందర్భంగా తొలి రోజు భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. భక్తి శ్రద్ధలతో పూజలు చేశారు. మొక్కులు మొక్కుకున్న కొంత మంది భక్తులు స్వామివారి మాలలు ధరించారు. వీరంతా తొమ్మిది రోజుల పాటు నియమ, నిష్టలతో దీక్షలు ఆచరించనున్నారు. ఆ తర్వాత స్వామి వారి సమక్షంలో మాలను విసర్జిస్తారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు మాట్లాడుతూ అభిషేకాల కోసం భక్తులు తమ గోత్రనామాలు నమోదు చేయించుకోవాలని కోరారు.

ప్రశాంతంగా తొలిరోజు ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్షలు

సబ్బవరం : సబ్బవరం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్షలను శుక్రవారం పకడ్బందీగా నిర్వహించినట్లు పరీక్షల చీఫ్ సూపరింటెండెంట్ వివేకానందరావు తెలిపారు. ప్రథమ సంవత్సరం ఇంటర్ జనరల్, ఒకేషనల్ కోర్సులకు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ పరీక్ష నిర్వహించారు. ద్వితీయ సంవత్సర విద్యార్థులకు మధ్యాహ్నం 2.30 నుంచి 5.30 వరకూ నిర్వహించారు. ఇంటర్ ప్రథమ సంవత్సరం జనరల్ కోర్సులకు చెందిన 78 మంది విద్యార్థులకు గాను 73 మంది హాజరు కాగా ఐదుగురు గైర్హాజరయ్యారు. ఒకేషనల్ కోర్సుల నుంచి 37 మందికి గాను 36 మంది హాజరుకాగా ఒకరు గైర్హాజరయ్యారన్నారు. ద్వితీయ సంవత్సరంలో జనరల్ కోర్సులకు 26 మందికి గాను 25 మంది హాజరు కాగా ఒకరు గైర్హాజరయ్యారన్నారు. సీసీ కెమెరాల పర్యవేక్షణలో పరీక్షలు నిర్వహించినట్లు చీఫ్ సూపరింటెండెంట్ వివేకానందరావు తెలిపారు.

ఉపాధ్యాయులకు సన్మానం



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న సర్పంచ్ కోటేశ్వరరావు, గ్రామస్తులు

కె.కోటపాడు: రొంగలినాయుడుపాలెం ప్రాథమిక పాఠశాలలో ప్రతి విద్యార్థిపైనా ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ చూపుతూ మంచి ఫలితాలు సాధిస్తున్నారని సర్పంచ్ పైల కోటేశ్వరరావు తెలిపారు. 2024–25 విద్యా సంవత్సరానికిగాను ఏపీ రెసిడెన్షియల్ స్కూల్లో గ్రామానికి చెందిన ఏడుగురు విద్యార్థులు ప్రవేశాలు పొందారు. ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు రెసిడెన్షియల్ సీట్లను సాధించడంలో ప్రత్యేక బోధన అందించిన హెచ్ఎం శ్రీను, ఉపాధ్యాయుడు సూరిబాబులను అభినందించారు. ఈ సందర్భంగా గ్రామంలో శుక్రవారం వీరిని గ్రామస్తులు దుశ్శాలువాలతో ఘనంగా సన్మానించారు. నీటి సంఘం అధ్యక్షుడు గొర్రుపోటు పైడంనాయుడు, రొంగలి నారాయణరావు, స్ఫూర్తి యువజన సంఘం సభ్యులు పాల్గొన్నారు.

జల గండం.. జర భద్రం




యండపల్లి శివారు వరాహనదిలో ప్రమాదకర ప్రదేశం

కోటవురట్ల: పిల్లలందరికీ నీరంటే భలే ఇష్టం.. వేసవి ఎండల నేపథ్యంలో నీటిలో ఆడడమంటే భలే సరదా.. సాధారణంగా వేసవి సెలవుల్లో విద్యార్థులు ఈత కొట్టేందుకు నీటి కుంటలు, చెరువుల వద్దకు వెళుతుంటారు. అయితే మండలంలోని పలు ప్రాంతాల్లో ఎలాంటి రక్షణ చర్యలు లేకపోవడంతో ఈత సరదా వారి ప్రాణాలమీదకు తెచ్చే ప్రమాదం ఉంది. సరదాగా ఈతకు వెళ్లిన పలువురు ఏటా మృత్యువాత పడుతున్నారు. ఈత ఎంత ఉల్లాసాన్ని ఇస్తుందో జాగ్రత్తలు పాటించకపోతే అంత విషాదాన్ని నింపుతుంది.. మండలంలోని పలు ప్రాంతాల్లో నదులు, బావుల వద్ద ప్రమాదాలు పొంచి ఉన్నాయి. గతంలో నదిలో స్నానాలకు వెళ్లిన పలువురు మృతిచెందిన ఘటనలు అనేకం ఉన్నాయి. మండలంలో వరాహనది పరీవాహక ప్రాంతంలోని యండపల్లి శివారున వంతెన సమీపంలోను, గవరపేట, ఇందేశమ్మవాక, గొట్టివాడ శివారు పైలట్ ప్రాజెక్టు ప్రాంతాల్లోని నదిలోని ఊబులు ప్రమాదకరంగా ఉన్నాయి. ఈత సరదాతో నదిలోకి దిగుతున్న పిల్లలు మృత్యువాత పడుతున్నారు. వేసవి సెలవుల్లో పిల్లల పట్ల తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలి. పిల్లలు నీటి వనరుల వద్దకు ఈతకు వెళ్లకుండా జాగ్రత్త పడాలని పలువురు సూచిస్తున్నారు.

30న ఆలయ భూముల కౌలుకు వేలం

బుచ్చెయ్యపేట: వడ్డాదిలో మూడు దేవాలయాల భూములను మూడేళ్లపాటు పాటు కౌలు చేసుకోవడానికి ఈ నెల 30న వేలం పాట నిర్వహిస్తున్నట్లు దేవస్థానం ఈవో శర్మ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వచ్చే నెల ఒకటో తేదీ నుంచి 2027 మే 31వ తేదీ వరకు వేలం దక్కించుకున్న కౌలు రైతులు సాగు చేసుకోవచ్చన్నారు. వేంకటేశ్వరస్వామి ఆలయానికి సంబంధించి వడ్డాదిలో సర్వే నంబర్ 176-5ఏలో 5.50 ఎకరాలు, 176-5ఏలో 1.50 ఎకరాలకు రూ.10 వేలు ధరావత్తు ముందుగా చెల్లించి 30వ తేదీన మధ్యాహ్నం 2 గంటలకు ఆలయం వద్ద నిర్వహించే వేలంలో పాల్గొనాలన్నారు. మల్లికార్జునస్వామి ఆలయానికి సంబంధించి వడ్డాదిలో సర్వే నంబర్ 37-16లో 3.42 ఎకరాలు, 37-17లో 4.44 ఎకరాలకు రూ. 2 వేల వంతున ధరావత్తు ముందుగా చెల్లించి ఆలయం వద్ద 30వ తేదీ మధ్యాహ్నం 12 గంటలకు జరిగే వేలం పాటలో పాల్గొనాలన్నారు. వడ్డాది రామలింగేశ్వరస్వామి ఆలయానికి సంబంధించి విజయరామరాజుపేట రెవెన్యూలో సర్వే నంబర్ 4-21లో 2.63 ఎకరాలకు ధరావత్తు రూ.5 వేలు, సర్వే నంబర్ 4-25లో 50 సెంట్లకు రూ.2 వేలు ధరావత్తు ముందుగా చెల్లించి 30వ తేదీన ఉదయం 11 గంటలకు ఆలయం వద్ద జరిగే వేలం పాటలో పాల్గొనాలన్నారు. ఆ రోజు వేలంలో పాట పాడినవారు మొదటి సంవత్సరం సొమ్ము అదే రోజు దేవస్థానానికి చెల్లించాలని ఈవో సూచించారు.

ముగిసిన వేసవి విజ్ఞాన శిబిరం



ముగింపు కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు

సబ్బవరం: ప్రముఖ ఆధ్యాత్మిక క్షేత్రం దేవీపురంలో విద్యార్థులకు నిర్వహించిన వేసవి విజ్ఞాన శిబిరం శుక్రవారంతో ముగిసింది.గత నెల 29 నుంచి ఈ నెల 24 వరకూ నిర్వహించిన శిబిరంలో 5,6 తరగతులతో పాటు 9,10 తరగతుల విద్యార్థులు పాల్గొన్నట్టు గురుమాత అన్నపూర్ణమ్మ తెలిపారు. విద్యార్థులకు యోగ,గణితం,వేద గణితం,ఇంగ్లిష్,వేద సూక్తులు,వేద విద్య,భజనలు,సంస్కృత సంభాషణ వంటి వాటిలో శిక్షణ ఇచ్చినట్లు చెప్పారు. విద్యార్థులంతా వారు నేర్చుకొన్న వేద మంత్రాలను పఠించి తల్లిదండ్రులతో పాటు ఆహూతులను ఆకట్టుకున్నారు. బాటజంగాలపాలెం సర్పంచ్ శ్రీనివాసరావు విద్యార్థులకు ధ్రువపత్రాలు అందజేశారు. ఏయూ సంస్కృత అధ్యాపకుడు వీర వరప్రసాద్, గుంటూరు నుంచి వచ్చిన గణిత అధ్యాపకులు మల్లాది నరసింహమూర్తి, అధ్యాపకురాలు సత్యవతి బోధించారు. శిబిరంలో పాలకొల్లు, యలమంచిలి, గోపాలపట్నం, గాజువాక, సబ్బవరం, బలిజపాలెం ప్రాంతాలకు చెందిన వారు పాల్గొన్నారు.